# చార్మినార్

"పెద్దాయనా! నీ పేరేంది?"

"యాదగిరి. మల్ల నల్గొండ కెల్లొచ్చిన..."

"భయపడకు బాగయితది... కట్టు విప్పుతాండ. ధీరే ధీరే కండ్లు తెరు..."

"ఆప్"

మెల్లగా భయంభయంగా కళ్ళు తెరిచాడు యాదగిరి. అలికేసినట్టు మబ్బు కమ్మినట్టు కన్పించింది. కనురెప్పలు మూసి మళ్ళీ తెరిచాడు.

దగ్గరవి... దూరంవి... అన్నీ స్పష్టంగా కన్పించాయి. ఆనందం తోసుకొచ్చింది. కంటి కొనల్నుంచి రెండు కన్నీటి బొట్లు జారిపడ్డాయ్.

అప్రయత్నంగా చేతులు జోడించాడు. డాక్టర్ దేవుల్లా ఉన్నాడు.

"ఇగ సూపు రాదనుకున్న. దినాం దినాం తడుముకుంట బతకాలనుకున్న... కాల్మొక్తా..." కన్నీళ్ళు ధారలు కడుతోంటే కాళ్ళ మీద పడబోయాడు.

"అరెరె... గదేం పని. మా నాయన వయసోడివి..... ఇంక ఫికర్లేదు. ఆ సీసాలోది గంటగంటకీ కండ్లల నాలుగు చుక్కలేసుకో. నాల్రోజుల వరకూ దూప్‌లో తిరగమాక...."

"గట్టలనే" తలాడించాడు.

కళ్ళు పరీక్షించి సంతృప్తి వ్యక్త పరిచారు. కళ్ళజోడు పెట్టి అటూ ఇటూ నడిపించారు. "అలవాటయే దాకా జాగ్రత్త..."

నర్సు వచ్చి మరిన్ని జాగ్రత్తలు చెప్పింది. 'సిటీల గడబిడ జరుగుతాంది. జాగర్తగెల్లు....."

"బస్సు అడ్డా కెళ్తే మావూరెల్లిపోయినట్టే..."

ఆమెకీ నమస్కరించి మెల్లగా కంటి ఆసుపత్రి నుంచి బయటికి నడిచాడు యాదగిరి.

నగరం చీకటి గుప్పిట్లో వుంది. రోడ్డు మీద జన సంచారం లేదు. రయ్‌రయ్ మని ఎడతెరిపి లేకుండా తిరిగే వాహనాలూ లేవు.

నలుదిక్కులకీ ఆశ్చర్యంగా చూశాడు. వెనక్కెళ్ళి సంగతేంటో అడుగుదామనుకునే ఆ ప్రయత్నం విరమించి రోడ్డెక్కాడు.

కడుపులో ఆకలి కరకరమంటోంది. చాయ్ తాగితే బావుణ్ణని చూశాడు. దగ్గర్లోని ఇరానీ హోటల్ మూసేసి వుంది. జేబులోని డబ్బు బయటికి తీసి లెక్కపెట్టుకున్నాడు. నలభై రూపాయల దాకా వున్నాయి. సరిపోతాయనుకుని సంబరంగా తల ఊపుకున్నాడు.

మెల్లగా నడుస్తున్నాడు. అతడొక్కడి కోసమే రోడ్డు వేసినట్టుగా వుంది. వీధి దీపాల వెలుగులో హుషారుగా అడుగులేస్తున్నాడు.

ఇలా నడిచి ఎన్నేళ్ళయ్యిందో!

కళ్ళు మసకబారి చూపు మందగించడంతో ఇంటికే పరిమితమయ్యాడు. కళ్ళ కన్నా చెవుల కెక్కువ పని చెబుతూ బండి లాక్కొస్తున్నాడు. సర్కారు దవాఖానాలో పేదోళ్ళకి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నారనీ కళ్ళద్దాలూ ఇస్తున్నారనీ తెలిసి నగరానికొచ్చాడు. ఆసుపత్రిలో చేర్చుకుని ఆపరేషన్ చేశారు. పోయిందనుకున్న చూపు తెప్పించారు!

'అంతా దేవుళ్ళే' తలూపుతూ అనుకుంటూ వుంటే అతడి ప్రక్కన పోలీసు జీపు ఆగింది.

"ఏయ్ – ఎవడివి బే..." కర్కశస్వరం గద్దించింది.

ఆసాంతం అనుమానపు చూపుల్తో పరిశీలించారు.

"యాదగిరిని సాబ్..." "రోడ్డు మీదేం పని. ఫో ఫో... ఇంటికి ఫో..."

"ఇంటికే బోతుండ..."

"చెబితే నీక్కాదు – ఫో... రోడ్ల మీదకి రాకూడదు. కర్ఫ్యూ వుంది..."

"బస్సు అడ్డాకి పోవాల్న..."

"బస్సో గిస్సో చల్తా నహీ... ఛలో... జావో జావో..." లాఠీతో తోసేశాడు.

జీపు వెళ్ళిపోయింది. పడబోతూ నిలదొక్కుకుని నోటి కొచ్చిన తిట్లన్నీ తిట్టేడు.

కాస్సేపు ఓ దుకాణపు అరుగు మీద కూర్చుని మళ్ళీ నడకందుకున్నాడు.

పదడుగు లేశాడో లేదో పోలీస్ హారన్ విన్పించింది. ఓ గల్లీ లోంచి కాగడాలతో వస్తోన్న జనం కకావికలయ్యారు.

యాదగిరి వెన్నులో భయం జరజరా పాకింది. చటుక్కున పక్క గల్లీలోకి తిరిగి పరుగులాంటి నడకందుకున్నాడు.

ఇరుగ్గా వుంది. గలీజుగా వుంది. చీకటిగా వుంది. అయినా పోలీసులకంట బడకూడదనుకుంటూ నడుస్తున్నాడు.

ఎటు వెళ్తున్నాడో ఎక్కడి కెళ్తున్నాడో తెలీట్లేదు. కడుపులో పేగులు మెలి తిరుగుతున్నాయి. అడుగులు తడబడుతున్నాయి. ఎవరైనా ఇన్ని చాయ్ నీళ్ళు పోస్తే బావుణ్ణనుకున్నాడు.

అన్ని తలుపులూ మూసుకున్నాయి. ఒకచోట నీరసంగా కూలబడ్డాడు.

ఒక తలుపు తీసి చెత్త బయటికి విసిరిందొకామె. గబగబా వెళ్ళాడు. దభీమని తలుపు వేసేసింది.

తలుపు తట్టి పిలిచాడు. జవాబు లేదు. ఆకలికి తాళలేక సొమ్మసిల్లి పోయాడు.

కాస్సేపటికి తలుపు తెరచుకుంది. ఇందాకటామె చూసింది. జాలిపడింది.

“దర్వాజా బంద్ కరో” లోపల్నుంచి అరిచిందో మగ గొంతు.

సైగల్తో ఎవర్నో పిలిచింది. ఇద్దరూ సాయం పట్టి ఇంట్లోకి తీసుకెళ్ళి తలుపేసేరు.

ఇంట్లోని మగాళ్ళు నిలువునా కాల్చేసేలా చూశారామె వంక. ఆమె పట్టించుకోలేదు.

“వో హిందూ హై...” ఒకరన్నారు.

వారికి జవాబివ్వకుండా అతడి మొఖం మీద నీళ్ళు చల్లింది ముంతాజ్. యాదగిరికి మెలకువ వచ్చింది.

“మస్తు ఆకలిగుంది. ఖానేకేలియే కుచ్....” కడుపు చూపిస్తూ అర్థించాడు.

“జావో జావో...” గొణిగినట్టుగా అన్నారొకరు.

న్యూస్ పేపర్ ముక్కలో రెండు రొట్టెలూ కూరవేసి తెచ్చి అతడి చేతిలో పెట్టింది.

మోకాళ్ళ మీద కూర్చుని ఆబగా తిన్నాడు. నీళ్ళు త్రాగాడు.

"అల్లా సల్లగ సూస్తడు..." కృతజ్ఞతగా చూసి దణ్ణం పెట్టి బయటికి నడిచాడు.

గల్లీ రోడ్డు మీదకి తీసుకెళ్ళింది. దిక్కులు చూస్తోంటే దూరాన పోలీస్ కాల్పులు విన్పించాయ్.

ప్రాణ భయంతో మరో వైపు పరుగు తీస్తోంటే అమాంతం పోలీసు వ్యాన్ అతడి ముందుకొచ్చింది. అతడి మాటలు విన్పించుకోకుండా బట్టల మూటని విసిరేసినట్టు అతడ్ని వ్యాన్‌లో పడేశారు.

"నేను చోర్‌ని కాదు నల్లగొండ కెళ్లొచ్చిన..."

"షటప్! కర్ఫ్యూ ఉండగా రోడ్డు మీదకెందు కొచ్చావురా బద్మాష్. నీకేమైనా అయితే ముందు మాకు చావొచ్చి పడుద్ది" కోప్పడ్డాడో పోలీస్.

"బస్సు అడ్డాలో వదలుండ్రి..."

యాదగిరి మాటలు విన్పించుకోలేదు. తిన్నగ్గా పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళారు. హౌస్ ఆఫీసర్కి అప్పగించారు.

"ఏయ్ ముసిలాయన. ఎవడివిబే. ఏ గ్రూపోడివి..." లాఠీ ఝళిపించాడతడు. అతడు ముసలివాడు కాకపోయుంటే లాఠీకి పని చెప్పేవాడే.

తన కథంతా ఏకరువు పెట్టాడు. కొత్త కళ్ళ జోడూ కళ్ళలో వేసుకునే అరుకూ అన్నీ చూపించాడు. అధికారికి అతడి మీద నమ్మకం కుదిరింది.

"గట్ల బోయి కూర్చో. తెల్లారి వెళ్దువులే..." మంద్ర స్వరంతో అన్నాడు.

స్టేషన్‌లోనే ఓ ప్రక్కన గోడకి జేరబడి కూర్చుని నిద్రలోకి జారుకున్నాడు యాదగిరి.

యాదగిరి లేచేసరికి తెల్లగా తెల్లారింది.

స్టేషన్నిండా పోలీసులే. అంతా హడా విడిగా వున్నారు. 'అక్కడేదో జరిగింది ఇక్కడేదో అడ్డుకున్నాం' అని చెప్పుకుంటున్నారు.

దాడులు దొమ్మీలు కొట్లాటలు అపహరణలు గృహదహనాలు కాల్పులు – అని చెప్పుకొంటోంటే నోరు తెరచుకుని విన్నాడు. అవి నగరంలో జరిగిన సంఘటనలని నమ్మలేక

పోతున్నాడు!

అతడి దృష్టిలో ఈ మహానగరమంటే అద్భుత ప్రదేశం. ఆశ్రయమిచ్చే తల్లి. ఆదుకునే జనవాసం. అండగా నిలిచే భాగ్య నగరం!

ఒకరు యాదగిరిని చూసి, "ఈ బుడ్డాని ఎక్కడ్నుంచి తెచ్చేరు?" అని అడిగాడు.

మిగతా వాళ్ళు నవ్వేరు.

"అమాయకుడు..... రాత్రి తిన్నాడో లేదో చాయ్ పానీకి ఇంతెజామ్ చెయ్యండి..."

బ్రెడ్, టీ తెచ్చిచ్చారు. వాళ్ళకి కృతజ్ఞతలు చెప్పి, "బస్సు అడ్డాకి ఎటుపోవాల్నా సాబ్" అనడిగాడు. ఎందుకో సిటీ నుంచి త్వరగా పారిపోవాలన్పిస్తోంది.

"బయటి కెళ్ళడానికి లేదు... రాస్తాలన్నీ బంద్. కర్ఫ్యూ పెట్టింద్రు"

"గదేంది సారూ..."

"గిది పాతబస్తీ. ఎరికేనా? హిందూ ముస్లింల మధ్య జగడం అవుతాంది...ఆళ్ళ మధ్య కెల్లి నావనుకో గంతే సంగతులు!"

"ఎందుకట్ల?" బాధతో కమిలిపోతూ అడిగాడు.

నవ్వేరు. "మా ఖర్మకాలి!" అని ఒకరంటే, "పవర్ కోసం భాయ్" అన్నారింకొకరు.

యాదగిరికేమీ అర్థం కాలేదు. అయోమయంగా చూశాడు.

ఎప్పుడో నవాబు కాలం నుంచీ కూడా ఇక్కడ ముసల్మానులున్నారు. హిందువులున్నారు. పార్శీలున్నారు. ఇరానియన్లున్నారు. క్రిస్టియన్లున్నారు. ఎన్నో రాష్ట్రాలవారున్నారు. ఎన్నో ప్రాంతాల వారున్నారు. అంతా అన్నదమ్ముల్లా కలిసుంటున్నారు. ఇప్పుడీ లొల్లి ఏంటో! ఎందుకో!

అతడి సందేహ నివృత్తి చేసేంత తీరికెవరికీ లేదు.

"ఏదైనా వెహికిల్ని చూసి యంజీబీకి పంపించెయ్యండి. మన వ్యాన్లో వద్దు. ఏ గుంపైనా దాడి చేస్తే ముసలోడు అన్యాయమై పోతాడు..." ఒక పోలీసు అధికారి అన్నాడు.

మరి కాస్సేపటికి జర్నలిస్టుల జీపు వచ్చింది. పోలీస్ ఇన్స్పెక్టర్ వాళ్లతో మాట్లాడి యాదగిరిని ఎక్కించాడు.

మౌనంగా కూర్చున్న యాదగిరిని చూచి "పోలీస్ స్టేషన్‌కి నిన్నెందుకు తీసుకొచ్చారు? దాడిలోనో దొమ్మీలోనో దొరికావా?" అడిగాడో జర్నలిస్టు.

"ఎరక్కపోయి సిటీకొచ్చి ఇరుక్కు పోయాట్ట" నవ్వేడు ఇంకో జర్నలిస్ట్.

"ఇది నగరం భాయ్. ఇక్కడివన్నీ పవర్ పాలిటిక్స్. పైచెయ్యి కావాలనుకున్నోడల్లా జనం బతుకుల్తో కబడ్డీ ఆడుతూంటాడు" ఇంకొకరన్నారు.

వారి మాటలకు మరింతగా మథన పడుతూండి పోయాడు తప్ప పెదవి విప్ప లేదు యాదగిరి.

చిన్నప్పుడు బడిలో పంతులు చెప్పిన మాటలు గుర్తొచ్చాయతడికి.

ఈ మహానగరాన్ని నిర్మించాక చార్మినార్‌లో నిలబడి మహమ్మద్ కులీ కుతుబ్ షా ఒక ప్రార్థన చేశాట్ట. అల్లా ఈ నగరానికి శాంతి సౌభాగ్యాలు ప్రసాదించాలనీ, అన్ని కులాల వారూ మతాల వారూ మహా సముద్రంలోని చేపల్లా నిండిపోయి కలిసుండాలనీ ప్రార్థించాట్ట.

ఆయన ఆశించినట్టుగానే అన్ని మతాలకీ అన్ని వర్గాలకీ అన్ని ప్రాంతాలకీ కూడలి అయ్యిందీ మహానగరం.

మరెందుకీ మతకల్లోలాలూ, అశాంతులూ, ఆందోళనలూ, కర్ఫ్యూలూ, కాల్పులూ!

కళ్ళున్నా చూడలేనంత గుడ్డి వారిని చేసిందా మత మౌఢ్యం?!

అతడి మెదడులో బాధ, వేదన సుళ్ళు తిరుగుతున్నాయి.

జీపు చార్మినార్ ప్రక్క నుంచి వెళ్తోంది.

మహోన్నత లక్ష్యాలకి నిదర్శనంగా ఎత్తుగా తలెత్తుకుని ఠీవిగా నిలబడున్న నాలుగు బురుజుల్నీ చూస్తూ ఉద్విగ్నుడయ్యాడు యాదగిరి.

అవి మసకమసకగా అలికేసినట్టుగా కన్పిస్తోంటే కన్పిస్తున్నంత వరకూ ఆ గత ఔన్నత్యపు చిహ్నాలనే చూస్తుండి పోయాడు!

**(ఆంధ్రభూమి దినపత్రిక 29.10.2011)**